

'మీ-కోసం' సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక మీ-కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అర్జీదారులు అర్జీలను 'మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే నమోదైన అర్జీల వివరాలను 1100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చ'ని ఆయన సూచించారు.



ప్రమాదానికి కారణమైన నీటిగుంత

ప్రాణం తీసిన నీటిగుంత

● ఊబిలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

● పందిగుంట గ్రామంలో విషాదం





అవినాష్, సుధీర్ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కోటబొమ్మాళి (సంతబొమ్మాళి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సెలవు దినం వేళ.. రెండిళ్లలో విషాదం నెలకొంది. తోటి స్నేహితులతో సరదాగా గోరింటాకు కోసం వెళ్లిన ఇద్దరు విద్యార్థులు కొంత సేపటి తర్వాత బహిర్భూమికి వెళ్లగా.. నీటిగుంత రూపంలో మృత్యువు వారిని వెంటాడింది. స్నానానికిగాను నీటి గుంతలో దిగిన ఆ ఇద్దరు విద్యార్థులు ఊబిలో చిక్కుకుని ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. తోటి స్నేహితులు చూసి.. వారిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంతబొమ్మాళి మండలం నర్సాపురం పంచాయతీ పందిగుంట గ్రామానికి చెందిన ముద్ద అవినాష్(9), పిల్లల సుధీర్(9) ఆదివారం సాయంత్రం నీటి గుంతలో మునిగి మృతి చెందారు. వీరిద్దరూ పందిగుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సాయంత్రం సమీపంలో ఉన్న చెరువు గట్టు మీద గోరింటాకు కోసం మరో ఇద్దరి స్నేహితులతో కలిసి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత అవినాష్, సుధీర్ బహిర్భూమి కోసం దగ్గరలో ఉన్న నీటిగుంత వద్దకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకున్నారు. తర్వాత (మిగతా 7వ పేజీలో..)

చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించి..

● చెరువులో మునిగి యువకుడి మృతి 8లో

విద్యార్థులకు భద్రత ఏదీ?



● ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళంలోని ఓ బాలికల వసతిగృహంలోకి ఆగంతుకులు ప్రవేశించారు. రాత్రి సమయంలో గోడ దూకి లోపలికి ప్రవేశించి ఓ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తోటి విద్యార్థినులు గమనించి కేకలు వేయగా.. అక్కడి నుంచి పరారీ అయ్యారు.

● వారం రోజుల కిందట వేకువజామున టెక్కలిలోని ఓ వసతిగృహంలో ఓ విద్యార్థిని గోడ దూకి పారిపోయింది. విశాఖ బస్సెక్కి వెళ్లిపోయింది. గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విశాఖ వెళ్లి పట్టుకున్నారు.

● రణస్థలంలోని ప్రభుత్వ వసతిగృహంలో ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులే లైంగిక దాడికి పాల్పడ్డారు. హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఒక జూనియర్ విద్యార్థిపై సీనియర్లు పైశాచికత్వం ప్రదర్శించి.. వీడియో చిత్రీకరించారు.

● ప్రభుత్వ వసతిగృహాల్లో వైఫల్యాలు

● సగానికిపైగా హాస్టళ్లలో వార్డెన్లు లేరు

● పర్యవేక్షణ లేక తప్పని ఇబ్బందులు

రణస్థలం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతిగృహాలకు సంబంధించి ఇటీవల వెలుగుచూసిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వసతిగృహాలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయి. వార్డెన్ల కొరత నేపథ్యంలో విద్యార్థుల రక్షణ, భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. కొంతమంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వంట మనుషులు, సెక్యూరిటీ గార్డులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి రాత్రిపూట వార్డెన్లు హాస్టళ్లకు రావడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో మెనూ అమలు, హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వసతి కూడా సక్రమంగా లేదు. పర్యవేక్షణ లేక విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు.



రణస్థలంలోని బీసీ బాలుర వసతిగృహం

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో 81 ప్రభుత్వ వసతిగృహాల్లో 6,500 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. 44 మంది మాత్రమే వార్డెన్లు ఉండగా.. 34 హాస్టళ్లను ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. సగానికిపైగా వార్డెన్లు లేకపోవడంతో ఒక్కొక్కరు రెండు హాస్టళ్ల బాధ్యతలు చూస్తున్నారు. వాస్తవానికి ప్రతి హాస్టల్‌లో వార్డెన్, డిప్యూటీ వార్డెన్, కుక్, సహాయకులు, నైట్ వాచ్‌మెన్ ఉండాలి. దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ ఏఎన్ఎంలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తుండాలి. కానీ వార్డెన్లు అరకొరగా ఉండగా.. మిగతా సిబ్బంది కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్నారు. రెండు మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించడంతో వార్డెన్లు పూర్తిస్థాయి లో పర్యవేక్షించడం లేదు. దీంతో విద్యార్థులు గాడి తప్పుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత 20ఏళ్లు గా వార్డెన్‌ల నియామకాలు చేపట్టలేదు. చాలా మంది పదవీ విరమణ పొందగా, వారి స్థానంలో కొత్త వారు రాలేదు. దీంతో ఏటా వార్డెన్ పోస్టుల ఖాళీలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వార్డెన్ల పోస్టుల భర్తీపై దృష్టి సారించాల్సి ఉంది. హాస్టళ్లలో వార్డెన్, వంట మనిషి, సహాయకులు, సెక్యూరిటీ గార్డులు పూర్తిస్థాయిలో ఉంటేనే విద్యార్థులకు రక్షణ, భద్రత ఉంటుంది.

● అరకొరగా మెనూ..

వసతిగృహాల్లో విద్యార్థులకు సంబంధించి డైట్ చార్జీలు పెంచకపోవడంతో ఆహారం నాణ్యతపైఆ ప్రభావం పడుతోంది. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో డైట్‌చార్జీలు పెంచారు. వైసీపీ పాలనలో అసలు డైట్ చార్జీలు పెంచకపోవడంతో మెనూ సక్రమంగా అమలుకాలేదు. కరోనా తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో మెనూలో కోత విధిస్తున్నారు. వారానికి ఆరు రోజులు పెట్టాల్సిన కోడిగుడ్డును రెండు రోజులే పెడుతున్నారు. చికెన్ వారానికి ఒక రోజుకే (మిగతా 7వ పేజీలో..)



బీచ్‌లో పర్యాటకుల సందడి

శ్రీకాకుళం/గార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆదివారం సందర్భంగా గార మండలం మొగదాలపాడు, కె.మత్స్యలేశం బీచ్‌ల్లో పర్యాటకుల సందడి కనిపించింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు పిక్నిక్‌ల పేరిట తరలివచ్చి.. సముద్ర స్నానాలు చేశారు. బీచ్ ఒడ్డున వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. బీచ్‌లో పర్యాటకులకు మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, సిబ్బంది, గార పోలీసులు హెచ్చరికలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



మొగదాలపాడు బీచ్‌లో యువకుల కేరింతలు

ఏడేళ్లుగా ఎదురుచూపు

● పూర్తికాని వనితమండలం- గార వంతెన పనులు

● మూడు మండలాల ప్రజలకు తప్పని ఇబ్బందులు

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వనిత మండలం - గార గ్రామాల మధ్య వంశధార నదిపై వంతెన నిర్మాణ పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గార, నరసన్నపేట, పోలాకి మండలాల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పడం లేదు. ఏడేళ్ల కిందట శంకుస్థాపన చేసినా.. పనులు పూర్తికావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో ఈ వంతెన నిర్మాణానికి రూ.72 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2018 మే 20న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో శరవేగంగా పనులు సాగాయి. వనిత మండలం వంతెన వరకు అనుసంధానం రోడ్డు నిర్మించారు. మబుగాం గ్రామంలో కొందరు రైతులు పొలాలు ఇవ్వడంతో వాటి మీదుగా రోడ్లు వేశారు. 59శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ వంతెన నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ప్రకటించారు. కానీ గత ప్రభుత్వం (మిగతా 7వ పేజీలో..)



అసంపూర్తిగా ఉన్న వనిత మండలం వంతెన

ఆదిత్యాలయం.. భక్తజన సంద్రం

అరసవల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక ద్వాదశి, ఆదివారం కావడంతో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం భక్తజన సంద్రమైంది. క్యూలైన్లు, ఆలయ పరిసరాలు, ప్రసాదాల కౌంటర్లు, కేశఖండన శాల, ఇంద్రపుష్కరిణి భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఒక్క రోజే ఆదిత్యుడికి రూ.11,10,320ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.7,69,800, విరాళాల రూపంలో రూ.79,040, ప్రసాదాల ద్వారా రూ.2,61,480 ఆదాయం సమకూరింది. భక్తులకు తాగునీరు, నీడ సౌకర్యానికి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



క్యూలో భక్తుల రద్దీ



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సాంకేతికతపై అవగాహన కల్పించండి

● మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

కోటబొమ్మాళి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయంలో సాంకేతికతతోనే సత్ఫలితాలు సాధ్యం. ఆ దిశగా రైతులకు నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించాల'ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశించారు. ఇటీవల పదోన్నతి పొందిన వ్యవసాయాధికారులు రాష్ట్ర సంఘ సభ్యులతో కలిసి ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులకు నోచుకోని 22 మందికి మంత్రి చొరవతో డీడీఏల నుంచి వ్యవసాయ సంయుక్త సంచాలకులుగా పదోన్నతి లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ.. సాగు దిగుబడి పెంచి.. వ్యవసాయం లాభసాటిగా మార్చాలని వారికి మంత్రి సూచించారు. అలాగే ప్రజాదర్బార్ నిర్వహించి.. వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను మంత్రి స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ రాష్ట్ర సంఘం సభ్యులు డి.ప్రవీణ్, శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్ఠువ్యాధిపై సర్వే
ఆలయాలకు భక్తుల తాకిడి
రైతుల శ్రమదానంతో గట్టు నిర్మాణం
7లో

బ్యాటరీ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం
8లో



దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

గేటు పడితే నరకమే

● ప్రారంభానికి నోచుకోని రైల్వే ఫ్లైఓవర్ల పనులు

● పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు తప్పని ఇబ్బందులు

ఇచ్ఛాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రైల్వేఫ్లైఓవర్ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 12 చోట్ల వంతెన నిర్మాణానికి రైల్వే అధికారులు ఈ ఏడాది మార్చిలో సన్నాహాలు చేశారు. కానీ, తర్వాత వాటి ఊసే మరచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే గేటు పడితే చాలు.. నిరీక్షణతోపాటు ట్రాఫిక్ నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలకు రైల్వేగేట్లు నరకయాతన చూపిస్తున్నాయి. ఇచ్ఛాపురం పట్టణాన్ని వేరుచేస్తూ ఉంటుంది రైల్వేలైన్. సగం పట్టణం రైల్వేలైన్ అవతల ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురంలో రైల్వేగేటు పడిందంటే చాలు ట్రాఫిక్ నిలిచిపోతుంది. ముఖ్యంగా రత్తకన్న గేటు నరకం చూపిస్తోంది. రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండడంతో నిత్యం ఈ గేటు వేసి ఉంటుంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారు పడే బాధలు అన్నీఇన్నీకావు. పురుషోత్తపురం, జగన్నాథపురం గేట్లు కూడా నరకయాతన చూపిస్తుంటాయి.

● పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలు వెళ్లాలంటే కాశీబుగ్గ సమీపంలోని ఎల్‌సీ గేటును దాటాల్సి ఉంటుంది. అటు వజ్రపుకొత్తూరు వెళ్లాలంటే తాళ్లభద్ర ఎల్‌సీ గేటు దాటాలి. ఈ రెండు గేట్లు పలాస రైల్వేస్టేషన్‌కు అటు ఇటుగా ఉంటాయి. దీంతో రైలు నిలిచినా.. గేటు అలానే మూసి వేసి ఉంటోంది. ఇప్పుడు కాశీబుగ్గ గేటు వద్ద వంతెన పనులు ప్రారంభం కావడంతో కొంతమ ఉపశమనం కలుగనుంది.

● మందస మండల ప్రజలకు కొర్రాయిగేటు, బాలిగాం, కొత్తపల్లి గేట్లు నరకయాతన చూపిస్తుంటాయి. సోంపేట మండలంలో పాలవలస, కొర్లాం గేట్ల వద్ద నిత్యం అదే పరిస్థితి. కంచిలి మండలానికి సంబంధించి బూరగాం, అంపురం, గొల్ల కంచిలి రైల్వేగేటు నిత్యం ప్రజలకు యాతన తప్పదు.



ఇచ్ఛాపురం రైల్వే ఎల్‌సీ గేటు వద్ద వాహనదారుల ఇబ్బందులు

● రైల్వేజోన్‌లో అన్యాయం..

ఇటీవల రైల్వేశాఖ విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ ప్రకటించింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతా ఈ జోన్ పరిధిలోకి వచ్చింది. కానీ పలాస-ఇచ్ఛాపురం స్టేషన్ల మధ్య ఉన్న 49 కిలోమీటర్లను మాత్రం భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్టుకోస్టు రైల్వేజోన్‌లో వదిలేసింది. దీంతో రెండు నియోజకవర్గాల ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారు. వాస్తవానికి హైవేల ఆధునికీకరణ ప్రక్రియ పూర్తయింది. ప్రధాన పట్టణాలను తప్పిస్తూ హైవేల నిర్మాణం జరిగింది. హైవే ఆధునికీకరణలో భాగంగా రైల్వేలైన్ ఉన్నచోట ఫ్లైఓవర్ నిర్మించారు. పట్టణాలకు ఉన్న రోడ్లలో మాత్రం (మిగతా 7వ పేజీలో..)

ఆలయాలకు భక్తుల తాకిడి

కార్తీక బహుళ ద్వాదశిని పురస్కరించుకుని జిల్లాలోని పలు దేవాలయాలు ఆదివారం భక్తులతో కిటకిట లాడాయి. స్వామిని దర్శించుకున్నారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం ఆదివారం భక్తుల కోలాహలంతో కళకళలాడింది. కార్తీక బహుళ ద్వాదశి 4వ ఆదివారం పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీముఖ లింగేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రత్యేక దర్శనం బారికేడ్లలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తగలకుండా షామియానాలు వేశారు. జలుమూరు ఎస్.ఐ బి.అశోక్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

శ్రీకూర్మానికి..

గార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మొదగాలబీచ్‌లో వన సమారాధన అనంతరం తిరుగు ప్రయాణంలోనూ భక్తులు వచ్చారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం



జలుమూరు: ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అంపోలు గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం రుత్వికులు, వేద పండితులు ప్రత్యేక హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిం చాలని వారు కోరారు.



గార: హోమం నిర్వహిస్తున్న రుత్వికులు



ఇచ్ఛాపురం: కుంకుమ పూజల్లో మహిళలు



గార: శ్రీకూర్మంలో స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఘనంగా వృశ్చిక సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వృశ్చిక సంక్రమం సందర్భంగా మండలంలోని ప్రధాన దేవాలయాల్లో సంక్రమణ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మండపల్లిలో..

మండపల్లి గ్రామ దేవత గారపోలమ్మ అమ్మవారి ఆలయంలో వృశ్చిక సంక్రమణం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం 108 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. చిన్నారుల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అయ్యప్ప మూలవిరాట్‌కు అభిషేకాలు

అయ్యప్పస్వామి పంచాయతన దేవాలయంలో ఆదివారం మూలవిరాట్‌కు అష్టాదశ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. కృష్ణారెడ్డి గురు స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ● పట్టణంలోని చిదంబరేశ్వర ఆలయ సింహద్వారం ప్రథమ వార్షి కోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కోనేరు వద్ద అఖండ దీపారాధన చేశారు.



స్వామికి అభిషేకం

ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆదిత్యాలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్

అరసవల్లి, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమం త్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ అందజేశారు.

ఆదిత్యునికి లక్ష విరాళం

శ్రీకాకుళానికి చెందిన ఆవల వెంకటసత్యనారాయణ దంపతులు స్వామికి రూ.లక్ష విరాళం అందించారు. ఆదివారం వారు స్వామిని దర్శించుకుని ప్రత్యే పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ మొత్తం వినియోగించాలని కోరారు. దాతలకు ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్‌చక్రవర్తి జ్ఞాపిక అందించారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి కుష్ఠువ్యాధిపై సర్వే

అరసవల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి 31 తేదీ వరకు కుష్ఠువ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నామని అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి తాడేల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వే నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 2,234 బృందాలను ఏర్పాటు చేశామని, ఇందులో ఒక ఆశా కార్యకర్త, ఒక మగ వలంటీరు ఉంటారని తెలిపారు. వీరు తమ గ్రామ పరిధిలోని 20 గృహాలను సందర్శించి, స్పర్శ లేని, మచ్చలున్న వ్యక్తులను గుర్తిస్తారన్నారు. కనురెప్పలు మాతపడక పోవడం, కాలు, చేతుల్లో వాపులు, తిమ్మిర్లు, పుండ్లు రావడం తదితర లక్షణాలుంటే కుష్ఠువ్యాధి సోకినట్లన్నారు. ఈ సర్వేలో అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీలకు పంపాలన్నారు. ప్రాథమిక దశలో గుర్తించి, మందులు అందించడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ఇచ్ఛాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పట్టణానికి చెందిన పూనా సంతోష్‌ను టీడీపీ నాయకులు ఆదివారం సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య ఆధ్వర్యంలో సంతోష్‌కు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో నేతలు ఆశి లీలారాణి, పూనా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న భిలాయిలో మత్స్యకార దినోత్సవం

సోంపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయిలో నిర్వహించనున్నట్లు మత్స్యకార సామాజిక సంస్థ అధ్యక్షుడు బర్రి జోగారావు తెలిపారు. ఈ మేరకు క్యాంప్-1 భిలాయి తెలుగు సమాజ్ భవనంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నవంబరు 21న నిర్వహిస్తున్నామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యెరుపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కన్నం రాజేంద్ర, కర్రి ఉమాశంకరరావు పాల్గొన్నారు.

ధరణి సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధరణి సమాఖ్య కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలిగా జమున, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి, కార్యదర్శిగా జి.ఈశ్వరి, జాయింట్ సెక్రటరీగా రేవతి, గోపమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్నిరాష్ట్ర బీసీ సంఘ కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు భద్రత ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

పరిమితం చేస్తున్నారు. కూరల్లో నాణ్యత కొరవడుతోంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని పలువురు కోరుతున్నారు. వసతి గృహాల్లో సమస్య ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● నివేదిక కోరాం..

ఇటీవల జరిగిన ఘటనలపై నివేదిక కోరాం. ప్రభుత్వ వసతిగృహాలకు సంబంధించి వార్డెన్ల కొరత వాస్తవమే. అయినా ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. జిల్లాలో 34 హాస్టళ్లకు సంబంధించి వార్డెన్ల కొరత ఉంది. కొందరికి అదనపు బాధ్యత పడుతోంది. దీనిపై ప్రభుత్వానికి నివేదించాం.

- అనూరాధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, శ్రీకాకుళం

గేటు పడితే నరకమే

(ఐదో పేజీ తరువాయి)

రైల్వేగేట్లు ఉండిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ల పనుల విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రైల్వేశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

ఇబ్బందులే..



రైల్వేగేట్లతో నరకయాతన పడుతున్నాం. ఇచ్ఛాపురం పట్టణానికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం కల గానే మిగులుతోంది. ఆ మధ్యన ఫ్లైఓవర్ అంటూ హడావుడి చేశారు. కానీ తరువాత దాని గురించి మరిచిపోయారు. దీనిపై పాలకులు చొరవ చూపాలి.

- సాలిన డిల్లీ, ఇచ్ఛాపురం



చాలా అన్యాయం..

ఇటీవల విశాఖ రైల్వేజోన్‌లో ఈ ప్రాంతాన్ని కలపకుండా చాలా అన్యాయం చేశారు. కనీసం ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడితే ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి. ఈ విషయంలో రైల్వేశాఖపై ప్రజా ప్రతినిధులు ఒత్తిడి పెంచాలి.

-సాలిన గాంధీ, ఇచ్ఛాపురం

ఐక్యతకు ప్రతిరూపాలు వన భోజనాలు: ఎన్ఈఆర్



ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు జ్ఞాపిక అందిస్తున్న దేవాంగ సంఘ నేతలు

లావేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి కుల, మత భేదాలు లేకుండా అందరూ ఐక్యంగా ఉండేందుకు కార్తీక వనభోజనాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం లావేరు మండలం బొడ్డపాడు తోటలో దేవాంగుల కులస్థుల వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సంద ర్భంగా ఎన్ఈఆర్‌ను ఆ సంఘ నేతలు శాలువ కప్పి జ్ఞాపిక అందించి సత్కరించారు. కార్యక్ర మంలో దేవాంగుల సంక్షేమ సంఘ నాయకులు హరనాథ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం తోటలో మండల కళింగ కోమట్ల సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం సందడిగా చేపట్టారు.

పంటల సాగుపై అవగాహన అవసరం

శ్రీకాకుళం రూరల్ నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): రబీ పంటలపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయ శాస్త్రవేత్త డా.కిరణ్‌కుమార్ అన్నారు. నైర వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సేవా శిబిరంలో భాగంగా ఆదివారం చల్లవానిపేట, భైరివానిపేట గ్రామాల్లో పర్యటించి పంటలను పరి శీలించారు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా.అనిల్ కుమార్ పెసర, మినుము, ఉలవ, మొక్కజొన్న తది తర పంటల సమయంలో చేపట్టాల్సిన నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, ఎరువుల వినియో గంపై అవగాహన కలిగించారు. క్షేత్రస్థాయిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి పంటలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. పలువురు రైతులకు కూరగాయల విత్తనాల కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారులు డా.రవి కుమార్, డా.గురుమూర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానంతో గట్టు నిర్మాణం

ఇచ్ఛాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులు సొంత నిధులతో పంట కాలువ గాయగట్టు నిర్మాణం ఆదివారం చేపట్టారు. గాయగట్టు పాడై నీరు దిగువకి వెళ్లిపోతుండడంతో రూ.50 వేలు సేకరించి శ్రమదానం చేసి ఇసుక మూటలను వేసి బాగు చేసుకున్నారు.



గాయగట్టుపై ఇసుక మూటలు వేస్తున్న రైతులు

వెంగళరావు కాలనీలో వైద్య శిబిరం



నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలోని వెంగళరావు కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది రోగులను వైద్యులు పి.తాతయ్యలు, జి.మనీష కె.హేమంత్, జి.సాయికిరణ్, ఏవీ పద్మజ పరీక్షించి మందు లను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే నిరుపేద మహిళలకు చీరలను బి.అజంతా కుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ కేవీ కామావధానులు, యూత్ కో-ఆర్డినేటర్ బి.దామోదర్ పట్నాయక్, సేవాదళ్ ప్రతినిధి కె.రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపు

(ఐదో పేజీ తరువాయి)

పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడంతో పనుల ఊసేలేదు. వనిత మండలం వంతెన నిర్మాణానికి సంబంధించి వంశధార నదిలో 18 పిల్లర్లు వేశారు. తాత్కాలిక ప్రాతిపదికన సీసీ రోడ్డు వేసి రెండు పక్కలా గజాలు అమర్చారు. రూ.33.94 కోట్ల విలువైన పనులు జరిగాయి. వాటికి సంబంధించి బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపేశారు.

పూర్తయితే.. ఎంతో ప్రయోజనం

వనిత మండలం వంతెన నిర్మాణం జరిగితే పోలాకి మండలాల్లో మత్స్యకార గ్రామాలకు కళింగ పట్నం దగ్గరవుతుంది. అలాగే నరసన్నపేట, పోలాకి మండలాలకు గార మండలంతో అనుసంధానం పెరుగుతుంది. శ్రీముఖలింగం- శ్రీకూర్మం పుణ్యక్షేత్రాలు మధ్య సుమారు 50 కి.మీ మేరకు దూరం తగ్గుతుంది. అలాగే కోస్టల్ కారిడార్ మరింత అనుసంధానం అవకాశం ఉంది. మూలపేట పోర్టు నుంచి కళింగపట్నానికి అనుసంధానం చేసేందుకు ఈ వంతెన దోహదపడుతుంది. గార మండల కేంద్రం మరింత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ వంతెన నిర్మాణం పూర్తిచేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

వనిత మండలం వద్ద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కూడా చొరవ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించారు. పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- తిరుపతిరావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ

విశాఖ సమ్మిట్‌లో పెట్టుబడుల వరద

● ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశాఖ పట్నంలో రెండు రోజులు నిర్వహించిన సీఐఐ సమ్మిట్ విజయవంతమై పెట్టుబడుల వరద కనిపించిందని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎంతో కష్టపడి ప్రపంచ దేశాల్లో పర్యటించి రాష్ట్రాన్ని పరిశ్రమల హబ్‌గా మార్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. రెండు రోజుల్లోనే భారీ ఒప్పందాలు కుదుర్చుకొని పెట్టుబడుల వర్షం కురిపించిన ఘనత వీరికే దక్కుతుందన్నారు. ఈ సమ్మిట్‌లో 613 ఒప్పందాల ద్వారా 16,13,188 ఉద్యోగావకాశాలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. పెట్టుబడులు ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా మూడు ప్రాంతా లకు సమాన ప్రాతిపదికన వెళ్లడం ప్ర భుత్వం వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రి లోకేశ్ రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు గైడ్ చేయడం జరిగిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఎవరూ ముందుకు రాలేదన్నారు. 2014-2019 మధ్య టీడీపీ పాలనలో వచ్చిన కొన్ని పరిశ్రమలు ఆ తరువాత రాష్ట్రం విడిచి పెట్టి వెళ్లిపో వడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు మళ్లీ రాష్ట్రం వైపు వస్తుండడం సీఎం చంద్ర బాబు సమర్థతకు నిదర్శనమని, రాష్ట్రాభివృద్ధి మరలా ట్రాక్ పైకి వచ్చిందని ఆయన అన్నారు.

జామియా మసీద్ అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని పురాతన జామియా మసీదు అభివృద్ధికి నూతన వక్ఫ్ బోర్డు కమిటీ కృషి చేయాలని.. అందుకు అవసరమైన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జామియా మసీద్ ప్రాంగణంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మసీదు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించే పనులు తక్షణమే చేపడతామన్నారు. త్వరలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో సోలార్ ల్యాంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వక్ఫ్‌బోర్డు కమిటీ మత విశ్వాసాలను గౌరవించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు మసీదుల ప్రతినిధులు, మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

సంఘటితంతోనే హైందవ వికాసం

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పొందూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉండడంతో హిందూ సంస్కృతి వికాసం చెందుతుందని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. కృష్ణాపురం ఆనందా శ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హిందూ ధార్మిక మహాసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ సంస్కృతి వికాసానికి పీఠాధిపతులు చేస్తున్న సేవలను కొనియాడారు. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, శంకరరావు, ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి, వివిధ పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు




పెయిన్స్ అండ్ గెయిన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రజని, ఏపీసీ శశిభూషణరావు

శ్రీకాకుళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆరోరోజు పుస్తక ప్రదర్శన కొనసాగింది. 'పెయిన్స్ అండ్ గెయిన్స్' పుస్తకాన్ని డా.బీఆర్ ఏయూ వర్సిటీ ప్రొఫెసర్ కేఆర్ రజని, సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆమదాలవలస ఎంఈవో కేపీ రాములు వేణు గానంతో అలరించారు. సిక్కోలు జనపద సాహిత్య కళా వేదిక, పలాస ఆధ్వర్యంలో కళాకారులు జానపద గీతాలను ఆలపించారు.



జానపద గీతాలను ఆలపిస్తున్న కళాకారులు



కేపీ రాములు వేణుగానం

ప్రాణం తీసిన నీటిగుంత

(ఐదో పేజీ తరువాయి)

నీటిగుంతలో స్నానానికి దిగారు. నీటిగుంతలో ఊబి ఉండడంతో బయటకు రాలేక మునిగిపోయారు. గోరింటాకు కోసం వారితోపాటు వచ్చిన మరో ఇద్దరు చిన్నారులు ఈ ఘటన చూసి కేకలు వేశారు.

ఆ దారి గుండా పోతున్న ఓ వ్యక్తికి విషయం చెప్పారు. ఆయన వచ్చి ఆ ఇద్దరి చిన్నారులను నీటిగుంత నుంచి బయటకు తీశారు. అప్పటికే వారిద్దరూ మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులు ముద్ద పాపారావు, అనురాధ, పిల్లల రాము, పుష్పలతతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుధీర్ అన్నయ్య రమాకాంత్ 6వ తరగతి, అవినాష్ అన్నయ్య తిరుపతి 7వ తరగతి కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. దీంతో ఉదయాన్నే పనులకు వెళ్లిపోయారు. కుమారుల మరణవార్త తెలుసుకొని లబోదిబోమంటూ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఆరా తీశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పాతపట్నం వారి తరఫున ఇవ్వడమైన పబ్లిక్ నోటీసు. ... షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం స.రి.వారి ఋజిలాకా, పాతపట్నం మండలం, కొరసవాడ పంచాయితీ, ... గ్రామం బాపతు ... డోర్ నెం.1-2గా గల రెండు దస్తావేజులు ప్రాప్తిగా గల పట్టా నెం.161, 407లుగా గల, సర్వే నెం.2/1లో ఎ.0.35శ.లు, సర్వే నెం.2/2లో ఎ.0.77శ.లు, సర్వే నెం.2/3లో ఎ.0.58శ.లు, సర్వే నెం.2/4లో ఎ.0.20లు వెరశి నా తాలూకా మొత్తం ఎ.1.90శ.లలో మధ్య దిశను క్రయ విస్తీర్ణం ప్లాటు నెం.78, 79, 80లుగా గల తూ.ప.లకు 36అడుగులు (10.98మీ.), ఉ.ద.లకు 50 అడుగులు (15.25మీ.) కొలతలు గల 200 చ.గ.లు (168చ.మీ.) వైశాల్యం గల ఖాళీస్థలమునకు హద్దులు తూ॥: ... గారి ప్లాటు నెం.81 ఖాళీస్థలం, ద॥ ప్లాటు రోడ్డు, ప॥: ... సత్యన్నారాయణ గారి ప్లాటు నెం.77 ఖాళీస్థలం, ఉ॥: డ్రెయిన్.

రాతు ప్రకాశరావు, అడ్వకేట్
పాతపట్నం, సెల్: 6281775139

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పీలాసి : 9985411532



ANDHRA JYOTHI AJ CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందా దారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతే కాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్ప వచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

వధువు కావలెను

→ శ్రీ లక్ష్మీ మీనాక్షి మ్యారేజ్ బ్యూరో: 30 సంవత్సరాలు పురోహితం 40,000 ఆదాయం విజయవాడ దగ్గర రెండు అంతస్తులు బిల్డింగ్ & స్థిరాస్తి గల బ్రాహ్మణ వరుడుకు బ్రాహ్మణ వధువు కావలెను. సెల్: 8367335909.
AJG-309

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029, పలాస: 9985411524
సోంపేట: 9989281099, రాజాం : 9573179776

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కర్రి దుర్యోధన రెడ్డి(30)మృతి చెందాడు. స్థానికులు, ఇచ్ఛాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంజాం జిల్లా అల్లాడిపూర్ గ్రామానికి చెందిన కర్రి దుర్యోధన రెడ్డి, స్నేహితుడు చంద్రయ్య రెడ్డితో కలసి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. దుర్యోధనరెడ్డి పైనుంచి ట్యాంకర్ వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలో వెనుక కూర్చున్న చంద్రయ్య రెడ్డి గాయపడడంతో అతనిని ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కోటబొమ్మాళి (సంతబొమ్మాళి), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ వై.సింహాచలం ఆదివారం సాయంత్రం తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వారం రోజులుగా ఈ ప్రాంతంలో ఆ వ్యక్తి భిక్షాటన చేసేవాడని తెలిపారు. హిందీలో మాట్లాడేవాడని, రాత్రి వేళ చెట్టు కింద నిద్రించేవాడని స్థానికులు తెలిపారన్నారు. చలి వల్లనో లేక విషసర్పం కాటు వేయడమో జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించి..

● చెరువులో మునిగి యువకుడి మృతి


రమేష్ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేట గ్రామంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. సూరాడ రోషన్ (10) అనే చిన్నారి స్థానికంగా ఉన్న చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో కొట్టుమిట్టాడసాగాడు. ఈ దృశ్యాన్ని గమనించిన గ్రామానికి చెందిన సోడిపల్లి రమేష్(23) వెంటనే బాలుడిని రక్షించేందుకు తీవ్రంగా శ్రమించాడు. ఎట్టకేలకు అతని ప్రయత్నం ఫలించింది. బాలుడిని ఒడ్డుకు చేర్చాడు. కానీ అప్పటికే రమేష్ బాగా అలసిపోవడంతో నీటిలో మునిగిపోసాగాడు. దీన్ని గుర్తించిన గ్రామస్థులు స్పందించి... బయటకు తీశారు. వెంటనే స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రమేష్ ఇటీవలే ఓ షిప్ కంపెనీలో ఉన్నత ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ నెల 18న విధుల్లో చేరాల్సి ఉంది. ఇంతలోనే మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

బ్యాటరీ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం


వాహనాలు కాలిపోయిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాగోలు గ్రామంలో ఏడీఎంఎస్ ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి షోరూంలో బైక్‌లకు వ్యాపించాయి. దీంతో సుమారుగా 13 కొత్త ఎలక్ట్రికల్ వాహనాలు మంటల్లో కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంట లను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో లక్షల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రణస్థలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌పురం పోలీస్ స్టేషన్ పరిధి చిల్లపేటరాజాం గ్రామ సమీపంలోని జీడి తోటలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చిల్లపేటరాజాం జీడితోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లి అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నా మన్నారు. వారి వద్ద నుంచి రూ.8950 నగదు, 6 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ విధానాల వల్లనే సంక్షోభాలు



ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

టెక్కలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం టెక్కలిలో రైతు సంఘం జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సర్వే చేసి.. సాగుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని, తక్షణమే రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జీడి, కొబ్బరికి మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా పి.చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పోలాకి ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా కోనారి మోహనరావు, బగాది వాసుదేవరావు, సహాయ కార్యదర్శిగా కొండయ్య, భాస్కరరావులను ఎన్నుకున్నారు. అంతకుముందు పట్టణంలో ఎర్రజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

పోలాకి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉత్సవాలను పోలాకిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మానస, సర్పంచ్ మజ్జి రమణమ్మ, మండల టీడీపీ అధ్యక్షులు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు తూలుగు అశోక్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు నేతేటి వల్లయ్యనాయుడు, పూర్వపు గ్రంథాలయాధికారి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో వన భోజనాల సందడి

కార్తీక మాసంలో చివరి ఆదివారం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల సాగర తీరాలకు సందర్శకులు పోటెత్తారు. తీరంలోని తోటల్లో వంటలు చేసుకొని..వన భోజనాలు చేశారు. పిల్లాపాపలతో రోజంతా సందడిగా గడిపారు. కొందరు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. గతంలో చోటుచేసుకున్న విషాద సంఘటనల నేపథ్యంలో సాగర తీరంలో ఎక్కడికక్కడ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పోలాకి: సందర్శకులతో రద్దీగా ఉన్న రాజారాంపురం సాగరతీరం


సంతబొమ్మాళి: భావనపాడు తీరంలో...


సోంపేట: బారువ తీరంలో...


వజ్రపుకొత్తూరు:శివసాగర్ బీచ్‌లో..

డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం ఉంటుందని.. సమావేశాలకు ఇబ్బందులు లేకుండా భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం పద్మనాభపురం కాలనీ డ్వాక్రా మహిళల సమావేశ భవన్నాన ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ నాలుగో వార్డు టీడీపీ ఇన్‌చార్జి రామకృష్ణ పాత భవనానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, నాయకులు లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సూర్యనారాయణ, సప్ప నవీన్, కృష్ణారావు, సత్యం, నరేంద్ర(చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆశయాలను సాధించాలి

భగవాన్ శ్రీసత్యసాయి బాబా ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం పద్మనాభపురం వద్ద బాబా శత జయంతి వేడుకల సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీజేరావు, శ్రీరామ్, చరణ్, టీడీపీ నాయకులు లొడగ ల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్, చిన్ని, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

పలాస రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాతికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని వక్తలు సూచించారు. పలాస మండలం మోదుగులపుట్టి గ్రామంలో ఆదివారం శ్రీరామకృష్ణ పరమహంస సేవా సమితి ప్రచారవేదిక ఆధ్వర్యంలో భక్తి విశిష్టతపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆధ్యాత్మిక అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ, విజయమ్మ దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, శ్రీనివాసరావు, నాయకులు అవుగాన షణ్ముఖరావు, దువ్వాడ సంతోష్, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సేవలు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం సేవలు అందిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. కాగువాడ గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్ మొఘల్ దుబాయ్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. అతని కుటుంబీకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈమేరకు వారికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.లక్షను స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతలే ప్రాతిపదికగా కూటమి ప్రభుత్వం సాయం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, సైలాడ సతీష్, సూరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

కొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యతతో కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కాపల దమయంతి కోరారు. ఆదివారం కొత్తూరు మండలం వసప గ్రామం వద్ద బీజేపీ కార్యకర్తల వనభోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండా రామ్మూర్తి, సర్పంచ్ ఆఫీసురావు, పల్లా అప్పలరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఒడియా భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఒడియా డీఐ దుర్గాప్రసాద్

హరిపురం/మందస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒడియా విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఐ దుర్గాప్రసాద్ చౌదరి అన్నారు. మందసలోని ఒడియా పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఒడియా మీడియం విద్యార్థులకు జిల్లాస్థాయి నవోదయ మోడల్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పరీక్షలో మందస, పలాస, సోంపేట, కంచిలి, బూర్జ మండలాలనుంచి 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ స్థానాన్ని కంచిలి మండలం బడ్డాయి పుట్టుగ పాఠశాల నుంచి పొట్టి జ్యోత్స్న, ద్వితీయ స్థానం కంచిలి మండలం సాగరనువాగం పాఠశాలకు చెందిన శ్రావణీ ప్రధాన్, మూడు, నాలుగో స్థానాలను అలెన ప్రధాన్, చిన్మయిలు సాధించారు. మరో ఆరుగురు విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లండ బాబూరావు, జగదీష్, ఈశ్వరరావు, ఒడియా టీచర్స్ అసోషియేషన్ ప్రతినిధులు కేసీహెచ్ మహంతి, శంకర్ మహరణ, యూటీఎఫ్ ప్రతినిధులు రాజాన పరమేశ్వరరావు, సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న పంచాది కాంతారావు

జలుమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బుడితి శాఖ సంఘం అధ్యక్షుడు పంచాది కాంతారావు అన్నారు. యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పోరాటం తోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. అనంతరం దంత వైద్యుడు చౌదరి రాజుబాబు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంఘం ఉపాధ్యక్షులు వాన కనకయ్య ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి చిన్నయరావు, జనరల్ సెక్రటరీ ఎ.చంద్రశేఖరరావు, గౌరవ అధ్యక్షులు ఎ.అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప పడిపూజ


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కోటబొమ్మాళి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని స్థానిక శబరిగిరీశుని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం వందలాది మంది దీక్షాధారుల శరణు ఘోష మధ్య పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, గురుస్వామి తంగుడు కృష్ణస్వామి, గురుస్వామి దూపాన వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుసరాపు కృష్ణబాబు పూజలు చేశారు.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం


ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని అభినందిస్తున్న స్థానికులు

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బొరిగివలస గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 18/1 గల ఇళ్లు, స్థలాలు ఏడేళ్లుగా రిజిస్ట్రేషన్ కావడం లేదు. దీని వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో కలెక్టర్ పరిష్కరించారు. ఈమేరకు పట్టణానికి చెందిన కొందరు ఆదివారం ఎమ్మెల్యేను అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో తమ సమస్య పరిష్కరించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన సతీష్, కోరాడ రామచంద్రరావు, రామకృష్ణ, వారణాశి రమేష్, కానూరి శివ తదితరులు పాల్గొన్నారు.

22న అమరవీరుల స్మారక సభ


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద చేపట్టనున్న శ్రీకాకుళం జిల్లా అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని న్యూ డెమొక్రసీ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం స్మారకస్థూపం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వంక మాధవరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎంతోమంది అమరులైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటిత కృషి


మాట్లాడుతున్న రాంబాబు

నరసన్నపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శిష్టకరణాలు సంఘటితంగా ఉండటం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆ సంఘ అధ్యక్షులు సదాశివుని రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక జీసీహోంలో శిష్టకరణ సంక్షేమ సంఘ కార్తీక వన సమరాధన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షులు సదాశివుని కృష్ణ, రఘుపాత్రుని శ్రీధర్, రమణమూర్తి, బుజ్జి పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల యాగం


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటలో వెలసిన బంగారమ్మతల్లి గుడివద్ద ఆదివారం గోపినంబాళ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం నవచండీ సహిత రాజశ్యామల యాగాన్ని ఘనంగా ప్రారంభించారు. వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ యాగం మంగళవారం వరకు కొనసాగుతుంది.

సమస్యలు పరిష్కరించండి

పోలాకి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని కోరుతూ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు ‘తెప్పల’కు ఆహ్వానం

పలాస రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జనవరి 3,4,5వ తేదీల్లో గుంటూరులో సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం అందిందని జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు తెప్పల కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదికపై కవిసమ్మేళనంలో తాను పాల్గొనబోతున్నానని తెలిపారు.

బిహార్ ఫలితాలపై సంబరాలు

మందస, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బిహార్ ఫలితాలు భారత్ అభివృద్ధికి సోపానమని బీజేపీ నాయకులు అన్నారు. మందసలో ఆదివారం బిహార్ ఫలితాలపై బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా 50మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి మిఠాయిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.క్రిష్ణమోహన్, టి.సురేష్, డి.వెంకట్రావు, బైరాగి, వై.విశ్వనాథం, లక్ష్మీనారాయణ, భవానీ బెహరా ఉన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు

నరసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మారుతీ నగర్, బొడ్డవలస, పెద్దపేట, కిల్లాం, కంబకాయి, కరగాం గ్రామాల్లో భక్తులు పల్లకి మహోత్సవాన్ని నిర్వహించారు. నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. వారం రోజులు పాటు గ్రామాల్లో సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

వేప, రావిచెట్లకు కల్యాణం

నరసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వమానవ కల్యాణార్థం కోమర్తి గ్రామంలో వేప, రావిచెట్లకు ఆదివారం కల్యాణం చేశారు. అనంత శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోకంగా పూజలను నిర్వహించి కల్యాణోత్సవ క్రతువు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కింజరాపు రాజారావు, లొట్టి రవి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. జమ్ము గ్రామంలోని శ్రీరామ మందిర ప్రాంగణంలో సామూహిక రుద్రభిషేకాలను నిర్వహించి.. అన్న సమారాధన చేశారు.

ముమ్మరంగా వరి కోతలు


యంత్రంతో కోస్తున్న దృశ్యం

నందిగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల వాతావరణ హెచ్చరికలతో రైతులు పంటను భద్రపరుచుకునేందుకు పాట్లు పడుతున్నారు. కొందరు అందుబాటులో ఉన్న యంత్రాలతో కోతలు చేయిస్తూ ధాన్యాన్ని కల్లాలకు చేర్చే పనిలో ఉన్నారు. మరికొందరు కూలీలు ద్వారా కోత కోయించి పొలాల్లోనే వరికుప్పలు పెట్టడం కనిపించింది. దీంతో గ్రామాల్లో రైతులు పంటను చక్కదిద్దే పనిలో బిజీబిజీగా ఉన్నారు.